క్లుప్తంగా

బాధితుడికి ఆర్థిక సాయం



నరసింహులుకు నగదు అందిస్తున్న నేతలు

ఎన్పీకుంట: ధనియానిచెరువు గ్రామానికి చెందిన నరసింహులు ఇటీవల రెక్కమాను సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స అనంతరం గురువారం ఇంటికి వచ్చాడు. ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొత్తరంగారెడ్డి రూ.10 వేలు, ప్రముఖ పారిశ్రామికవేత్త ముసల్‌రెడ్డిగారి హరీష్‌రెడ్డి రూ.10 వేలు, స్థానిక నాయకులు రూ.5 వేల నగదును బాధితుడి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా వారు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు ఆదినారాయణరెడ్డి, రాఘవయ్య, అల్లాబక్షు, ఉపసర్పంచ్ భాస్కర్‌రెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, సంతోష్‌రెడ్డి, మహమ్మద్‌హనీఫ్, సిద్దారెడ్డి, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

క్రేన్ బోల్తా

పుట్టపర్తి అర్బన్: మద్యం మత్తులో ఉన్న ఆటో డ్రైవర్ రాంగ్ రూట్‌లో క్రేన్ కిందకు వస్తూ ఉండడాన్ని గమనించి డ్రైవర్ షడన్‌గా బ్రేకు వేయడంతో వాహనం బోల్తా పడింది. చెర్లోపల్లి వద్ద జరుగుతున్న హంద్రీనీవా కాలువ పైప్ లైను పనుల నుంచి పుట్టపర్తి వైపు క్రేన్ బయలుదేరింది. వెంగళమ్మచెరువు ఘాట్ వద్దకు రాగానే ఆటో డ్రైవర్ రాంగ్ రూట్‌లో క్రేన్ కిందకు వస్తుండగా గమనించి డ్రైవర్ బ్రేక్ వేశాడు. దీంతో క్రేన్ పక్కనే ఉన్న కొండను ఢీకొని రోడ్డుపై బోల్తాపడింది. డ్రైవర్ చాకచక్యంగా తప్పించుకోగా ఎటువంటి ప్రమాదం జరగలేదు. ప్రమాదంలో నుజ్జునుజ్జయిన క్రేన్ మరో క్రేన్ తీసుకొచ్చి తరలించారు. క్రేన్ ఆటోపై పడి ఉంటే సుమారు 12 మంది ప్రమాదంలో పడేవారని స్థానికులు చెప్పారు.

కందిలో పంటకోత ప్రయోగాలు



పంట దిగుబడిని పరిశీలిస్తున్న అధికారులు

బత్తలపల్లి: గరిశలపల్లి, మాల్యవంతం గ్రామాల్లో గురువారం ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కంది పంటలో అధికారులు పంటకోత ప్రయోగాలను నిర్వహించారు. రైతు సరస్వతి పొలంలో కేజీ 1.680 గ్రాములు, మాల్యవంతంలో రాజేంద్రప్రసా పొలంలో కేజీ 320 గ్రాములు దిగుబడి వచ్చిందని ఏఓ ఓబిరెడ్డి, ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహాశర్మ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఈఓ రవి, వీఎస్ఏ లావణ్యలత, ఏఈఓ శ్రీనివాసులు, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కోఆర్డినేటర్‌లు మంజునాథ్, శ్రీనివాసులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్రశాంతి నిలయం: ఉపాధి హామీ కూలీలు, పేదలు, దళితుల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, సాకే వెంకటేశులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. సంఘం జిల్లా కోశాధికారి స్వర్ణలత, జిల్లా కమిటీ సభ్యురాలు కురుబ రమాదేవి పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



శిబిరాన్ని పరిశీలిస్తున్న ఏడీ శ్రీనివాసులు

బత్తలపల్లి: పశు ఆరోగ్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం తంబాపురం, పోట్లమర్రి, వేల్పుమడుగులో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 98 పశువులకు సాధారణ పరీక్షలు, 42 పాడి పశువులకు గర్భకోశ చికిత్సలు, 253 పశువులు, 6,680 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించినట్లు వారు తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం



నగదు అందిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లిలో మరియమ్మ అనే మహిళ అనారోగ్యంతో మృతిచెందింది. గురువారం ఆమె అంత్యక్రియలకు గాను వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.బత్తల హరిప్రసాద్ రూ. 10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ మొత్తాన్ని తన తండ్రి మాజీ సర్పంచ్ బత్తల వెంకటరమణ చేతుల మీదుగా అందించారు.

పంచాయతీ అధికారుల అలసత్వం.. కార్మికుల నిర్లక్ష్యం వెరసి ప్రజలకు శాపంగా మారింది. రోడ్లపైనే చెత్తదిబ్బలు.. కాలువల నిండుగా మురుగు.. రోజుల తరబడి అలానే ఉంటుండటంతో దుర్వాసన వస్తోంది. కడుపు తిప్పేస్తోంది. దుర్గంధం నడుమే సహజీవనం చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. రోగాలు దరువేస్తున్నా పాలకుల్లో చలనం ఉండడం లేదు. ఇంతటి దుర్భర పరిస్థితి ఉన్నది ఎక్కడో కాదు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరం నియోజకవర్గంలోని బత్తలపల్లి మండల కేంద్రంలోనిది.



ఇళ్ల మధ్య కాలువలో ముందుకు సాగని మురుగునీరు



ఇంటి ముంగిటనే మురుగు

చెత్త కదలదు.. మురుగు పారదు

- రోడ్డుపై నుంచి డంపింగ్ యార్డుకు చేరని చెత్త
- పట్టించుకోని బత్తలపల్లి పంచాయతీ అధికారులు



చెత్తతో నిండిపోయి, ముందుకు సాగని మురుగు నీరు

బత్తలపల్లి: పేరుకే స్వచ్ఛతాహీ సేవ.. స్వచ్ఛాంధ్రప్రదేశ్.. స్వచ్ఛభారత్ నినాదం. క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధం. మేజర్ పంచాయతీ బత్తలపల్లిలో పారిశుధ్యం లోపించడమే ఇందుకు నిదర్శనం. కార్మికులు చెత్త ఊడ్చి రోడ్డుపైనే ఉంచుతున్నారు. డంపింగ్ యార్డు ఉన్నప్పటికీ అందులోకి చేర్చడం లేదు. ఇక వీధుల్లోని చెత్త సైతం ఎక్కడికక్కడ పేరుకుపోతోంది. డ్రెయినేజీలు చెత్తాచెదారంతో నిండింది. వీటిని శుభ్రం చేయకపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. బత్తలపల్లి ఎస్సీ కాలనీ, టీచర్స్ కాలనీ, ధర్మవరం రోడ్డు, పాతవూరు, ఎస్టీ కాలనీ, ముస్లిం కాలనీల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. కూడలిలో చెత్తను తొలగిస్తున్న కార్మికులు కాలువలను పట్టించుకోకపోవడంతో కంపుకొడుతున్నాయి. వర్షాలు వచ్చినపుడు కాలువల్లోని మురుగు పొంగి రోడ్లపైకి, లోతట్టు ఇళ్లల్లోకి చేరుతోంది. కూడలిలోనుంచి మురుగునీరు ఎస్సీ కాలనీకి ప్రవేశిస్తుంది. అయితే అక్కడ కాలువల్లోంచి సాఫీగా వెళ్లే అవకాశం లేకపోవడంతో మురుగు నిలిచిపోయి దుర్వాస వస్తోంది. అక్కడ దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయి. టీచర్స్ కాలనీకి వెళ్లేదారిలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎప్పుడూ చెత్త నిల్వ ఉంటోంది. ఇక్కడ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి అగ్గి రవ్వలు ఎగిసిపడినప్పుడు చెత్త అంటుకుంటోంది. సమీపంలోనే బ్యాంకులు, నివాసాలు ఉన్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పట్టించుకోని అధికారులు

ఎస్సీ కాలనీలోకి వెళ్లే దారిలో మురుగునీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని మాజీ జెడ్పీటీసీ సభ్యులు అక్కిం నరసింహులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు మాతంగి రామాంజనేయులు పంచాయతీ అధికారులను కోరినా వారు పట్టించుకోలేదు. వైద్య సిబ్బంది ఫొటోలు తీసుకుని వెళ్లినా ఎలాంటి ప్రయోజనమూ లేదు.

పరిష్కారం ఇలా..

బత్తలపల్లిలో దశాబ్దాల కిందట వేసిన రోడ్లు ఇప్పుడు చిన్నబోయాయి. సిమెంట్ రోడ్లు వేయడంతో మరింత కుచించుకుపోయాయి. డ్రెయినేజీలు పెద్దవిగా చేయాలి. ఎస్సీ కాలనీలోకి వెళ్లేదారిలో కల్వర్టు తరహాలో నిర్మించాలి. చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తే ఇబ్బందులు ఉండవు. కాలువల్లో పూడిక తీసేస్తే మురుగు సాఫీగా ముందుకు సాగిపోతుంది.

మురుగునీరు పునాదుల్లోకి వెళ్తోంది



కాలువల్లో మురుగునీరు ముందుకు కదిలే పరిస్థితి లేకపోవడంతో పునాదుల్లోకి నీరు నెమ్మదిగా ఇంకుతోంది. ఇల్లు దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. నిలిచిన నీరు ముందుకు పారేలా చూడాలని అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోతోంది.

– శాంతి, గృహిణి, బత్తలపల్లి

రోగాలబారిన పడుతున్నాం



మురుగు నీరంతా ఇంటి ముందే నిలిచిపోయింది. దీంతో దోమలు బాగా పెరిగాయి. రోగాలబారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాం. ఎస్సీ కాలనీలో కాలువలన్నీ మురుగుతో నిండిపోయాయి. శుభ్రం చేయించాలి.

–పెద్దక్క, గృహిణి, బత్తలపల్లి

దుర్వాసన భరించలేకున్నాం



డ్రెయినేజీల్లోనే మురుగు నిలిచిపోయింది. చిన్న వర్షం పడినా రోడ్డుపైకి పొంగుతోంది. డ్రెయినేజీలు చిన్నవిగా ఉండడం, కొన్నిచోట్ల దెబ్బతినడంతో మురుగు పారడం లేదు. పేగులు మెలితిప్పేంతగా దుర్గంధం వస్తోంది. పాలకులు, అధికారులు ఒకసారి క్షేత్రస్థాయిలో పర్యటిస్తే మా ఇబ్బందులు తెలుస్తాయి.

– రాములమ్మ, గృహిణి, బత్తలపల్లి

మెరుగైన వైద్యసేవలు అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్రనాయక్

నల్లచెరువు: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్రనాయక్ సిబ్బందికి సూచించారు. ఎం. అగ్రహారంలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని గురువారం డీఎంహెచ్ఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉప కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న కుష్టు సర్వే వేగవంతంగా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ కల్పనరెడ్డి, ఏఎన్ఎం సరస్వతి, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

‘ఉల్లాస్’పై శిక్షణ



మెటీరియల్ పంపిణీ చేస్తున్న అధికారులు

ఎన్పీకుంట: స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో గురువారం వయోజన విద్య సూపర్‌వైజర్ సుధాకర్‌యాదవ్ అధ్యక్షతన ‘ఉల్లాస్’ కార్యక్రమంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లో మహిళలకు విద్య నేర్పించేందుకు ఉల్లాస్ కార్యక్రమం చేట్టామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా చదవడం, రాయడం, గణిత ప్రక్రియలు నెరవేర్చడమే కాకుండా మారుతున్న సమాజానికి అనుగుణంగా డిజిటల్, లీగల్ అక్షరాస్యత, వీడియో పాటలు నేర్పుతారని తెలిపారు. అనంతరం వలంటీర్లకు మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈఓపీఆర్డీ మాధవరెడ్డి, వయోజనవిద్య ఏపీఓ జనార్దన్‌గౌడ్, వెలుగు ఏపీఎం వెంకటనారాయణ పాల్గొన్నారు.

సర్పంచుకు అభినందనలు



సర్పంచ్‌ను అభినందిస్తున్న డీఎల్‌పీఓ అంజనప్ప

నల్లచెరువు: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ ఉత్తమ సేవా అవార్డుకు నల్లచెరువు మేజర్ పంచాయతీ సర్పంచ్ పంచ రత్నమ్మ ఎంపికైంది. సచివాలయం-1లో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎల్‌పీఓ అంజనప్ప, ఎంపీడీఓ రఘునాథగుప్త, ఈఓఆర్డీ శకుంతల సర్పంచ్‌ను అభినందించారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఈ నెల 26 ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా పంచరత్నమ్మ ఉత్తమ అవార్డు అందుకోనున్నట్లు వారు తెలిపారు.

ఆదర్శప్రాయుడు సుభాష్ చంద్రబోస్



సుభాస్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు

ధర్మవరం అర్బన్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ అందరికి ఆదర్శమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం సుభాష్ చంద్రబోస్ 128వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ గోపాల్‌నాయక్, అధ్యాపకులు చిట్టెమ్మ, షమీవుల్లా, కిరణ్‌కుమార్, పావని, భువనేశ్వరి, స్వామి, పుష్పావతి, ఆనంద్, సరస్వతి, బి.ఆనంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

తలుపుల: స్థానిక మూడురోడ్ల కూడలి వద్ద నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. నాయకులు ఎద్దుల రాముడు, చాంద్‌బాషా, రామాంజి, రమణ పాల్గొన్నారు.

కనగానపల్లి: స్వాతంత్ర్య పోరాటంలో గొప్ప సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ అని గ్రంథాలయాధికారి గోవిందు తెలిపారు. సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా గురువారం స్థానిక గ్రంథాలయంలో అధికారులు, విద్యార్థులు చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

ధర్మవరం: ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోవాలని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్‌హెచ్ బాషా, హరికుమార్, వెంకటస్వామి, రామంజనేయులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, మారుతి, ఆదినారాయణ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేతకు రూ.2వేల కోట్లు కేటాయించాలని, చేనేతపై జీఎస్టీ పూర్తిగా రద్దు చేయాలని కోరారు. 200 యూనిట్ల ఉచిత కరెంటుకు వెంటనే జీఓ విడుదల చేయాలన్నారు. బోగస్ చేనేత సహకార సంఘాలను రద్దు చేసి పనిచేస్తున్న సహకార సంఘాలను ప్రోత్సహించాలన్నా. చేనేత కార్మికులకు 3 సెంట్ల స్థలంలో మగ్గం షెడ్‌తో కూడిన ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. సొంత స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షలు ఉచితంగా ఇవ్వాలని చెప్పారు. చేనేత మహిళకు ప్రసూతి సమయంలో ఆర్థిక సాయం చేయాలని, చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్‌లు ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. చేనేత కార్మికులకు వెల్ఫేర్ ఫండ్ బోర్డు ఏర్పాటు, సహకార సంఘాల అప్పు రద్దుతోపాటు ధర్మవరంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

బాల్య వివాహాలను అరికడదాం

తనకల్లు: బాల్య వివాహాలను అరికడదామని తహసీల్దార్ శోభ సువర్ణమ్మ, సీడీపీఓ గంగరత్నమ్మ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాల నిరోధక చట్టంపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. తల్లిదండ్రుల నిరక్షరాస్యత, ఆర్థిక పరిస్థితుల కారణంగా బాల్య వివాహాలు జరిపిస్తున్నారని, వాటిని అరికట్టడానికి మండల, గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామ కమిటీలో సర్పంచు, మహిళా కార్యదర్శి, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లయితే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, జయమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ ఓబులేసు, ఏపీఓ మరియమ్మ, సమత సంస్థ ప్రతినిధులు శ్రీనివాసులనాయుడు, మౌనిక, వీఆర్వోలు, కార్యదర్శులు, మహిళా కార్యదర్శులు పాల్గొన్నారు.

బీసీ వెల్ఫేర్ అధికారిని సస్పెండ్ చేయాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

కదిరి అర్బన్: కదిరి డివిజన్ లోని బీసీ హాస్టళ్లలో అవినీతికి పాల్పడుతున్న కదిరి ఏబీసీడబ్ల్యూఓ బాలాజీ, నల్లచెరువు బీసీ హాస్టల్ వార్డెన్ లక్ష్మీనారాయణను సస్పెండ్ చేయాలని అఖిలపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అంబేద్కర్ కూడలి వద్దనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ హాస్టళ్లలో ప్రభుత్వం నిర్ణయించిన మెనూ అమలు చేయడం లేదన్నారు. డివిజన్ అధికారి విచారణ పేరుతో ప్రతి వార్డెన్ వద్ద నెలకు రూ 2వేలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రతి వార్డెన్‌కు బిల్లు పడితే 10 శాతం కమీషన్ ఇవ్వాల్సిందేనన్నారు. ఎదురుతిరిగిన వర్కర్లు, వార్డెన్లు, కిందిస్థాయి సిబ్బందిని ఏబీసీడబ్ల్యూఓ కులం పేరుతో దూషిస్తున్నాడన్నారు. కొంతమంది వార్డెన్లను బినామీలుగా పెట్టుకుని వార్డెన్‌ల మధ్య గొడవలు పెడుతున్నాడని ఆరోపించారు. ఏబీసీడబ్ల్యూఓ, వార్డెన్‌ల అవినీతిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర నేత రాఘవేంద్ర, జిల్లా నాయకులు చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబ్జాన్, ఏఐఎస్ఎఫ్ నాయకులు మహేంద్ర, ఎంఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జ్ మహేంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



వేరుశనగలో చీడ పీడల నివారణపై రైతులకు సూచలిస్తున్న ఏఓ ముస్తఫా

ధర్మవరం రూరల్: వేరుశనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ ముస్తఫా రైతులకు సూచించారు. గురువారం నాగలూరు గ్రామంలో వేరుశనగ పంటను ఆయన పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వేరుశనగ పంటలో మచ్చ తెగులు ఎక్కువగా ఆశించిందని, లేద దశలో తెగులు నివారణకు సాఫ్ రెండు గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. ముదురు దశలో ఉన్న వేరుశనగకు అజాక్సిస్ట్రోబిన్ 11 శాతం, టుబుకొనజోల్ రెండు ఎంఎల్ లీటరు నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలన్నారు. కంది పంటను ప్రభుత్వం రూ.7550 మద్దతు ధరతో కొనుగోలు చేస్తోందన్నారు. పంట విక్రయానికి కంది రైతులు రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఉద్యాన శాఖ సహాయకుడు సాయిచరిత్, రైతులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: స్థానిక జిల్లా వ్యవసాయ కార్యాలయంలో గురువారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఉద్యోగుల సంఘం ముద్రించిన టేబుల్ క్యాలెండర్‌ను డీఏఓ సుబ్బారావు ఆవిష్కరించారు. ఈసందర్భంగా సంఘం రాష్ట్ర కోశాధికారి శ్రీహరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రూపేష్‌కుమార్, ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షులు నరసింహ మాట్లాడుతూ వ్యవసాయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సంఘం జిల్లా సహా అధ్యక్షుడు ఆనందరాజు, కోశాధికారి ఆదిల్‌బాషా, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, నారాయణస్వామి, శివకుమార్, రామలింగారెడ్డి, కార్యదర్శులు అనిల్, రాజేష్, మోహన్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులురాజ్యలక్ష్మి, ఖాద్రి, ఈ సీ సభ్యులు వెంకటేశ్వర్లు, రహంతుల్లా, శశికళ, హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీఓ వరప్రసాద్

నల్లచెరువు: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ఆర్టీఓ వరప్రసాద్, ఎస్ఐ మక్బూల్ బాష పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవంలో భాగంగా గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి గీతా మందిరం వరకూ వాహన డ్రైవర్లతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్టీఓ మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారు మాత్రమే వాహనం నడపాలన్నారు.

ధర్మవరం రూరల్: మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ధర్మవరం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం ఆయన ఆటోడ్రైవర్లు, వాహనదారులతో రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలన్నారు.

బత్తలపల్లి: ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను పాటించాలని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా రోడ్డు ప్రమాదాలు వాటి నివారణ అనే అంశంపై విద్యార్థులతో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

చెన్నేకొత్తపల్లి: రహదారి భద్రతా మాసోత్సవం భాగంగా గురువారం స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ మద్యం సేవించడంతో పాటు హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలను నడపకూడదన్నారు. కార్యక్రమానికి రామగిరి సీఐ శ్రీధర్, ఎస్ఐ సత్యనారాయణ హాజరయ్యారు.

నాణ్యమైన ఆహారం అందించండి



భోజనాన్ని రుచి చూస్తున్న చైర్మన్ ఓబుళపతి

పుట్టపర్తి టౌన్: అన్నా క్యాంటీన్ ద్వారా పేదలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, కమిషనర్ ప్రహ్లాద నిర్వాహకులను ఆదేశించారు. గురువారం ఎనుములపల్లి వద్దనున్న అన్నా క్యాంటీన్‌లో ఆహారాన్ని రుచి చూశారు. శానిటేషన్ అధికారి శివయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

ఎన్పీకుంట: స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను గురువారం వైద్య సిబ్బంది బుల్డోజర్‌తో తొలగింపజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్రనాయక్ ఆకస్మికంగా తనిఖీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆసుపత్రి ఆవరణలో పిచ్చి మొక్కలను గమనించి వెంటనే తొలగించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. స్పందించిన వైద్య సిబ్బంది పిచ్చి మొక్కలను తొలగించారు. వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌వర్ధన్, సీహెచ్ఓ నాగలక్ష్మి పాల్గొన్నారు.

దంపతులకు గాయాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలయ్యాయి. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. నార్పల మండలం గూగూడు గ్రామానికి చెందిన జగన్‌మోహన్‌రెడ్డి అతని భార్య శివజ్యోతి రామగిరి మండలం పోలేపల్లికి వెళ్లి తిరిగి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. పట్టణంలోని సబ్‌జైలు పెట్రోల్ బంకు వద్ద మరో వ్యక్తి తన బైక్‌ను పెట్రోల్ వేయించుకునేందుకు అకస్మాత్తుగా తిప్పడంతో వారి బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో జగన్మోహన్‌రెడ్డి తలకు తీవ్రగాయాలయ్యాయి. భార్యకి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా జగన్మోహన్‌రెడ్డికి ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కేసు నమోదు

కదిరి టౌన్: అదనపు కట్నం వేధింపులపై బాధితురాలి ఫిర్యాదు మేరకు అత్తింటి వారిపై కేసు నమోదు చేసినట్లు కదిరి పోలీసులు తెలిపారు. వివరాలు... కదిరిలోని గాంధీనగర్‌కు చెందిన అగిసం మణెమ్మ, ఓడీసీ మండలం యద్దలవాండ్లపల్లికి చెందిన అగిసం సురేంద్ర 14 సంవత్సరాల క్రితం పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. పెళ్లి సమయంలో 10 తులాల బంగారు నగలను ఇచ్చారు. వీరికి సంతానం లేకపోవడంతో ఇటీవల సురేంద్రతో పాటు ఆయన తల్లి శాంతమ్మ, తండ్రి ఆదినారాయణ రూ.5 లక్షల అదనపు కట్నం తీసుకువస్తే కాపురానికి పిలుచుకుంటామని వేధింపులకు తెరలేపారు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.